స్టూడెంట్ స్పెషల్ బస్సుకు మంగళం

మదనపల్లె– గుర్రంకొండ మార్గంలో ఆర్టీసీ ఏర్పాటు చేసిన స్టూడెంట్ స్పెషల్ బస్సుకు అధికారులు మంగళం పలికారు. రెండు నెలల కిందట ఏర్పాటు చేసిన బస్సు మూన్నాళ్ల ముచ్చటగా నడిచింది.. అనంతరం నిలిపివేయ దంతో సాక్షాత్తూ రవాణా శాఖ మంత్రి సొంత జిల్లాలోనే మళ్లీ బస్సుల కోసం విద్యార్థులకు కష్టాలు తప్పని పరిస్థితి.

- బస్సుల కోసం ఉదయం, సాయంత్రం విద్యార్థులకు మళ్లీ కష్టాలు
- నిత్యం గుర్రంకొండ బస్టాండు నుంచి 600 మంది విద్యార్థుల ప్రయాణం



గుర్రంకొండ బస్టాండులో బస్సు కోసం వేచి చూస్తున్న విద్యార్థులు

గుర్రంకొండ: మండలంలోని గుర్రంకొండకు నిత్యం వందలాది విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు రాకపోకలు సాగిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి గుర్రంకొండ బస్టాండు చేరుకుని నిత్యం 600 మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు చదువు నిమిత్తం మదన పల్లెకు వెళుతుంటారు. రోజూ ఉదయం 7.30 నుంచి విద్యార్థులు బస్సు కోసం వేచి చూస్తూ ఉండడం పరిపాటిగా మారింది. రెండు నెలల క్రితం బస్సు కోసం ఎన్ని కష్టాలో కథనం సాక్షిలో ప్రచురితమవగా స్పందించిన మదనపల్లె ఆర్టీసీ అధికారులు ఉదయం, సాయంకాలం మదనపల్లె– గుర్రంకొండ మార్గంలో స్టూడెంట్ స్పెషల్ బస్సు సర్వీసు ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థుల కష్టాలు తీరాయని తల్లిదండ్రులు సంబరపడ్డారు.

రెండు నెలలకే నిలిపివేత

గుర్రంకొండకు అధికారులు ఏర్పాటు చేసిన స్టూడెంట్ స్పెషల్ బస్సు కథ మూన్నాళ్ల ముచ్చగా ముగిసింది. వారం రోజులుగా బస్సు రాకపోవడంతో విద్యార్థుల కష్టాలు షరా మామూలే అన్న చందంగా మారాయి. మళ్లీ ఉదయం నుంచి 9.30 గంటల వరకు బస్టాండులో విద్యార్థులు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీనికి తోడు ఉదయం రద్దీ ఎక్కువగా ఉండడం.. మరోవైపు కళాశాల సమయం దాటిపోతుండడంతో చేసేదిలేక విద్యార్థులు బస్సులో వేలాడుతూ ప్రయాణిస్తున్నారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తోందనని వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సాక్షాత్తూ రవాణా శాఖ మంత్రి సొంత జిల్లాలోనే బస్సుల కోసం విద్యార్థులు కష్టాలు పడాల్సివస్తోందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్టూడెండ్ బస్సు తిరిగి ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

స్టూడెంట్ స్పెషల్ బస్సు నడపాలి



విద్యార్థుల కోసం ఆర్టీసీ అధికారులు స్టూడెంట్ స్పెషల్ బస్సు నడపాలి. గతంలో గుర్రంకొండ నుంచి మదనపల్లె మార్గంలో రెండు స్టూడెంట్ బస్సులు నడిపేవారు. మళ్లీ నడిపేందుకు చర్యలు తీసుకుంటే విద్యార్థుల కష్టాలు తీరుతాయి.
– సుభద్రమ్మ, విద్యార్థిని తల్లి, గుర్రంకొండ

ఇబ్బందులు పడుతున్నాం



స్టూడెంట్ స్పెషల్ బస్సు నిలిపివేయడంతో ఉదయం, సాయంకాలం ఇబ్బంది పడుతున్నాం. పాఠశాలకు వెళ్లే సమయంలో అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటుచేయాలి. బస్సు లేక పాఠశాలలకు ఆలస్యంగా చేరుకోవాల్సి రావడంతో పాఠాలు అర్థం కాని పరిస్థితి. – విష్ణు, విద్యార్థి, గుర్రంకొండ

నా దృష్టికి రాలేదు

మదనపల్లె– గుర్రంకొండ మార్గంలో స్టూడెంట్ బస్సు సర్వీసు నిలిపి వేసిన విషయం నా దృష్టికి రాలేదు. గతంలో నేనే స్టూడెంట్ స్పెషల్ బస్ ఏర్పాటు చేశా. ఒక వేళ మరమ్మతులకు గురైందేమో తెలుసుకుంటా. బస్సు సర్వీసు పునరుద్ధరించేందుకు చర్యలు చేపడతాం.
– వెంకటరమణారెడ్డి, డిపో మేనేజర్, మదనపల్లె

క్లుప్తంగా

యోగ భోగేశ్వరస్వామి ఆలయంలో పూజలు



ప్రత్యేక అలంకరణలో యోగభోగేశ్వరుడు

మదనపల్లె సిటీ: స్థానిక బెంగుళూరు రోడ్డులోని యోగ భోగేశ్వరస్వామి ఆలయంలో సోమ వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం చేసి భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ప్రతిభ



లోహన్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలోని ప్రశాంత్ నగర్‌లోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థి టి.లోహన్ పోషకాహార లోపాలపై ప్రాజెక్టు తయారుచేసి ప్రతిభ చూపారు. ప్రాజెక్టు వర్కులో భాగంగా న్యూట్రీషన్, విటమిన్ లోపం, వీటిని ఏ విధంగా అరికట్టాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లోహన్ ప్రాజెక్టు తయారుచేసి సబ్ కలెక్టర్ మేఘ స్వరూపకు అందజేశారు. దానిని పరిశీలించిన సబ్ కలెక్టర్ తోపాటు పాఠశాల ఆర్‌ఎం శ్రీధర్, ఏజీఎం సురేష్, ప్రిన్సిపల్ మహమ్మద్ రఫీ, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

నవంబరు 4న మాదిగల ఆత్మీయ సదస్సు



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వాల్మీకిపురం: తిరుపతి నగరంలో నవంబరు 4వ తేదీన నిర్వహించే రాయలసీమ స్థాయి మాదిగల ఆత్మీయ సదస్సును విజయవంతం చేద్దామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామక్రిష్ణ మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని వెలగపల్లి, జోగినాయనిపల్లి, శాఖంవారిపల్లి, టేకలకోన తదితర ప్రాంతాల్లో ప్రచారరథంపై సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటేష్, రవీంద్ర, చిన్న, రెడ్డెప్ప, వెంకటరమణ, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపు అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ట

కలికిరి: మండలంలోని బోయపల్లి వద్ద నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం అంకాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పి.రమణయ్య, సురేష్‌కుమార్ తెలిపారు. సోమవారం రాత్రి అమ్మవారి మూలవిగ్రహం తీసుకువచ్చి గ్రామోత్సవం జరిపారు. వారు మాట్లాడుతూ మంగళవారం కలశ స్థాపన, శిఖర ప్రతిష్ట, గణపతి హోమం జరుగుతుందని వారు పేర్కొన్నారు. బుధవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, పూర్ణాహుతి, కుంభాభిషేకం కార్యక్రమాలు ఉంటాయన్నారు.


ఎల్‌ఐసీ పాలసీదారులకు బోనస్ పెంచాలి



ధర్నా నిర్వహిస్తున్న ఎల్‌ఐసీ ఏజెంట్లు

పీలేరురూరల్: ఎల్‌ఐసీ పాలసీదారులకు బోనస్‌ను పెంచాలని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.చంద్రశేఖర్‌రెడ్డి, పి.మధుసూదనరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద సోమవారం ఏజెంట్లతో కలిసి వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్‌ఐసీ ఏజెంట్ల సంక్షేమాన్ని పునరుద్ధరించాలని, పాలసీలపై జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసీ ఏజెంట్లు ఎం.కేశవ, మదనమోహన్‌రెడ్డి, శివయ్య, చంద్రారెడ్డి, ధర్మాంగదరెడ్డి, సురేష్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌రెడ్డి

పీలేరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తలపుల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి సూచించారు. స్థానిక పద్మావతీ నగర్‌లో సోమవారం వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని కాచి వడపోసి తాగాలన్నారు. ఆహారం తినేముందు చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ, చెత్తా చెదారం లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ నౌషాద్, హెచ్‌ఈ.కొండయ్య, శ్రీనివాసులు, రత్నం, శివ, ఏఎన్‌ఎం విజయకుమారి పాల్గొన్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తాం



ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సన్మానిస్తున్న క్రైస్తవ పాస్టర్లు

మదనపల్లె: నియోజకవర్గంలోని క్రైస్తవుల సంక్షేమానికి చిత్త శుద్ధితో కృషిచేస్తానని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. పట్టణంలోని జేసీఎం కమ్యూనిటీ హాల్‌లో మదనపల్లె యునైటెడ్ బ్లెస్డ్ చర్చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను పాస్టర్లు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వందేళ్లకు పైబడిన జేసీఎం చర్చి, ఎంఎల్ఎల్ ఆస్పత్రి, క్షయ వ్యాధికి సంజీవని ఆరోగ్యవరం ఇలా క్రైస్తవసంఘాల ఆధ్వర్యంలో ప్రజలకు సేవలందించడం అభినందనీయమన్నారు. యునైటెడ్ బ్లెస్డ్ చర్చెస్ అసోసియేషన్ సభ్యులు నియోజకవర్గంలోని క్రైస్తవులకు చర్చిల నిర్మాణం, ఇళ్లు, శ్మశాన వాటిక స్థలాలకు అవసరమైన స్థలం కేటాయించాలని కోరారని, త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాస్టర్లు మాట్లాడుతూ.... గుంటూరులో రూ.10 కోట్లతో క్రిస్టియన్ భవన్ నిర్మాణం పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ డేవిడ్‌రాజు, పాస్టర్ మాథ్యూస్, సీఎస్ఐ చర్చి సెక్రటరి భక్తవత్సలం, మాస్టర్ బోనాసిజాన్‌బాబు, పాస్టర్ పాల్ వెంకటరమణ, లేవి ప్రభుదాస్, జాన్ అధిశయం, ఆర్థర్, శామ్యూల్, పెద్ద సంఖ్యలో క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దారు భీమేశ్వరరావు

పీలేరు: ప్రజా సమస్యలను నూతన బాధ్యతలు తీసుకున్న వీఆర్వోలు సత్వరమే పరిష్కరించాలని తహసీల్దారు ఎం.భీమేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వీఆర్వోలతో ఆయన సమావేశమయ్యారు. భీమేశ్వరరావు మాట్లాడుతూ ఎప్పటి సమస్యలను అప్పుడే పరిష్కరించాలని, ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పవద్దని సూచించారు. దొడ్డిపల్లెకు ఎల్లప్ప, కాకులారంపల్లెకు బి.శ్రీనివాసరావు, ముదుపులవేములకు వెంకటేశ్వర్, పీలేరు1కు సుధాకర్, పీలేరు2కు కళ్యాణి, పీలేరు3కు రెడ్డిశేఖర్, పీలేరు4కు ఇబ్రహీం, పీలేరు 5కు శ్రీనివాసులునాయుడు, రేగళ్లకు కవిత, బాలంవారిపల్లెకు నారాయణ, వేపులబైలుకు రమణయ్య, అగ్రహారానికి ఇమ్రాన్, బోడుమల్లువారిపల్లెకు సిద్దయ్య, గూడరేవుపల్లెకు హేమంత్‌నాయక్, తలపులకు అజయ్, మేళ్లచెరువుకు కదిరప్పను నియమించారు. వారంతా సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

వంక ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి



సమస్యను కలెక్టర్‌కు విన్నవిస్తున్న రైతులు

రాయచోటి/వాల్మీకిపురం: ప్రకృతి సిద్ధంగా వెలసి పదిమందికి ఉపయోగపడుతూ పశువుల దప్పికను తీర్చే ఊటవంకను ఆక్రమణదారులు నుంచి కాపాడాలని వాల్మీకిపురం గ్రామస్తులు కోరుతున్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పరిష్కార వేదికలో వాల్మీకిపురం గ్రామం పత్తెపురం రైతులు కలెక్టర్‌ను కలిసి వంక ఆక్రమణ సమస్యను తెలియజేశారు. గ్రామంలోని సర్వే నెంబర్. 982లో 4.44 ఎకరాల వంక భూమిని గ్రామంలోని కొందరు ఆక్రమించడంతో సమీప పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వంక భూమిలో పశువులను మేపుకోవడానికి.. ఊటనీటిని తాపుకోవడానికి వీలు లేకుండా ఆక్రమణలు చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాజకీయ పలుకుబడితో సమీప ప్రాంతాల్లో ఉన్న రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా కొలతలు వేయించి పట్టా భూములలో వంక ఉన్నట్లు చూపించి ప్రవాహంలో ఉన్న వంకను పూడ్చి వేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. కావున సత్వరం స్పందించి ఎఫ్‌ఎంబీ రికార్డులు మేరకు సర్వే చేయించి వంక భూమిని కాపాడాలని గ్రామ రైతులు కలెక్టర్‌ను కలిసి విన్నవించుకున్నారు.

ఊరు మధ్య టపాకాయలు విక్రయించవద్దు



టపాసుల దుకాణానికి స్థలం పరిశీలిస్తున్న తహసీల్దారు ఫణికుమార్

కలకడ: ఊరు మధ్యలో టపాకాయలు విక్రయిస్తే కేసులు తప్పవని తహసీల్దారు ఫణికుమార్ ఆదేశించారు. కలకడ టౌన్‌లోని టపాకాయల వ్యాపారులు చూపిన వారపు సంత ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. పైన విద్యుత్తు తీగలు, చుట్టు ప్రక్కల నివాసాలు ఉన్నాయని, ఏ ప్రమాదం జరిగినా నివారించలేమని ఆయన అన్నారు. టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధి చివర శాంతినికేతన్ పాఠశాల సమీపంలో దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని, మంటలు అదుపు చేయడానికి నీటి ట్యాంకు ఉండాలని సూచించారు.

బాధ్యతల స్వీకరణ

నిమ్మనపల్లె: మండలంలో నూతనంగా తొమ్మిది మంది వీఆర్వోలు సోమవారం విధుల్లో చేరినట్లు తహసీల్దారు ధనుంజయ తెలిపారు. తంబళ్లపల్లె మండలం రేణుమాకులపల్లెలో పనిచేస్తున్న ఎం.నాగరాజ రెడ్డివారిపల్లె–2కు, రామసముద్రం మండలం కె.సి.పల్లిలో పని చేస్తున్న ఎం.శ్రీనివాసులు తవళంకు, కురబలకోట మండలం అంగళ్లు–2 వీఆర్ఓగా పనిచేస్తున్న పి.హేమాంబర్‌రెడ్డి రెడ్డివారిపల్లె–1కు, కురబలకోట–2 వీఆర్ఓగా పని చేస్తున్న ఎం.సురేంద్రరెడ్డి నిమ్మనపల్లె–1కు, వాల్మీకిపురం మండలం గండబోయనపల్లె వీఆర్ఓగా పనిచేస్తున్న టి.శ్రీనివాసులు ముష్టూరుకు, పీలేరు మండలం ముదుపులవేముల వీఆర్ఓగా పనిచేస్తున్న ఎం.శాంతకుమార్‌రెడ్డి రాచవేటివారిపల్లెకు, వాల్మీకిపురం–4 వీఆర్ఓగా పనిచేస్తున్న టీ.సుధాకర్ సామకోటవారిపల్లెకు, గుర్రంకొండ–1 వీఆర్ఓగా పనిచేస్తున్న ఎం.రెడ్డిరాణి నిమ్మనపల్లె–2కు,గుర్రంకొండ మండలం నడిమికండ్రిగక వీఆర్ఓగా పని చేస్తున్న ఎం.ప్రవీణ్‌కుమార్ వెంగంవారిపల్లెకు బదిలీఅయి బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు.

ఆయాలకు వేతనం ఇవ్వాలి



కనీస వేతనం ఇవ్వాలని కోరుతున్న ఆయాలు

మదనపల్లె: మున్సిపల్ పాఠశాలల్లో ఏళ్ల తరబడి పారిశుధ్య పనులు చేస్తున్న ఆయాలకు కనీస వేతనాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మున్సిపల్ పాఠశాలల్లో 30మంది పనిచేస్తున్నారని తెలిపారు. వారికి ఇచ్చే రూ.4 వేలు, రూ.8 వేల వేతనాలు సక్రమంగా ఇవ్వక పోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మస్తాన్, సంజీవ, మాధవి, రెడ్డెమ్మ, సుబ్బలక్ష్మి, నారాయణమ్మ, రమాదేవి, తులసి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

తంబళ్లపల్లె: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బదిలీపై వచ్చిన సచివాలయ సిబ్బందితో సోమవారం ఆయన సమీక్షించారు.ఎంపీడీవో మాట్లాడుతూ ప్రాథమిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

డీటీకి బాధ్యతలు

కలికిరి: కలికిరి తహసీల్దారు మహేశ్వరిభాయి వ్యక్తిగత కారణాలపై సెలవులో వెళ్లడంతో ఆ స్థానంలో డిప్యూటీ తహసీల్దారు ఎస్.నవీన్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు ఆదేశాలిచ్చారు.

అగ్నిమాపక శాఖ అధికారిగా సుబ్బరాజు

ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ అగ్నిమాపక శాఖ అధికారిగా సుబ్బరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నగరి సర్కిల్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సర్కిల్ పరిధిలోని ఐదు మండలాల నుంచి కాకర్స్ దుకాణాల అనుమతుల కోసం 23 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వచ్చిన మొత్తం దరఖాస్తులను పరిశీలించి అర్హత ఉన్నవాటికి అనుమతులు మంజూరు చేస్తామని ఫైర్ అధికారి సుబ్బరాజు పేర్కొన్నారు.

వీల్ చైర్ వితరణ

మదనపల్లె సిటీ: రామసముద్రం మండలం నడింపల్లి పంచాయతీ జంగాలపల్లికి చెందిన రాజ్ కుమారుడు సహర్ష్‌కు అధికారులు సోమవారం వీల్ చైర్ అంద జేశారు. ప్రత్యేక ప్రతిభావంతుడైన సహర్ష్ నడకలేకపోవడంతో వీల్‌చైర్ కావాలని వెలుగు కార్యదర్శి ఉదయ్‌మోహన్‌రెడ్డిని కోరారు. ఆయన స్పందించి సోమ వారం వెలుగు కార్యాలయంలో వీల్ చైర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు సారా విక్రేతల అరెస్టు

నిమ్మనపల్లె: సారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలం లోని ముష్టూరు పంచాయతీ గౌనివారిపల్లె సమీపంలోని చింతచెట్టు వద్ద నాగులయ్యగారిపల్లెకు చెందిన సీకోల గిరి (25), గౌనివారిపల్లెకు చెందిన బాలే చంద్రశేఖర్ (32) సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

భక్తులతో కిటకిట

తంబళ్లపల్లె: తంబళ్లపల్లెలో వెలసిన భమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున మల్లయ్యకొండను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఈఓ మునిరాజ, కొండ కిట్ట భక్తులకు అన్నదానం చేశారు.

విద్యార్థులూ..మత్తుకు బానిసలు కావద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ప్రసాద్‌బాబు

గుర్రంకొండ: విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు బానిసలు కావద్దని వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు అన్నారు.స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చదువుకొనే దశలో మత్తుకు బానిసలైతే జీవితం నాశనమవుతుందన్నారు. సైబర్ క్రైమ్ గురించి అవగాహన కలిగి ఉండాలని, సెల్ ఫోన్లలో మెసేజీలు, ఇతర మార్గాల ద్వారా సైబర్ నేరాలకు పాల్పడే అవకాశముందన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకోవద్దని సూచించారు. ఎక్కువ వడ్డీలు వసూలు చేయడంలో లోన్ యాప్ నిర్వాహకులు క్రూరంగా వ్యవహరిస్తారన్నారు. మరింతమంది దళారులు తమకు పెద్ద నాయకులు బాగా తెలుసు అని, ఉద్యోగాలిప్పిస్తామంటూ నమ్మించి డబ్బు వసూలు చేస్తున్నారన్నారు. డిగ్రీ విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని, మంచి మార్కులు తెచ్చుకొంటేనే ఉద్యోగం వస్తుందనే విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ నాగమల్లయ్య, ఎస్ఐ మధు రామచంద్రుడు, రమణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

డంపు చేసిన ఇసుక మాయమైందని ఫిర్యాదు

బి.కొత్తకోట: కురబలకోట మండలం కంటేవారిపల్లె జగనన్న కాలనీలో నిల్వ చేసిన ఇసుకను దొంగలు తరలించుకుపోయినట్టు ముదివేడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హౌసింగ్ అధికారుల సమాచారం మేరకు.. బి.కొత్తకోట, కురబలకోట మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఇసుక సరఫరా చేసేందుకు కంటేవారిపల్లె జగనన్న కాలనీలో భారీ స్థాయిలో ఇసుక నిల్వ చేశారు. జాతీయ రహదారిపై ఉన్న ఈ కాలనీ వద్ద ఇసుక నిల్వలు ఉండటంతో భద్రత ఉంటుందని అధికారులు భావించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అగస్టు 11న రాత్రి నిల్వల నుంచి ఇసుకను భారీ స్థాయిలో తరలించుకుపోయారు. మరుసటిరోజు హౌసింగ్ వర్క్ ఇన్స్‌పెక్టర్ శైలజ ఇసుక చోరీ జరిగిందని ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గుర్తు తెలియని వ్యక్తులు అంటూ కేసు నమోదు చేశారు. పది టిప్పర్ల ఇసుక చోరీకి గురైందని తెలిసింది. నిల్వ ఇసుకనైనా అక్రమంగా లేదా చోరీకి గురికాకుండా చూడాల్సి వుంది.

పరిహారం ఇప్పించండి సబ్ కలెక్టర్ సారూ..

- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్‌కు రైతుల వినతి



సబ్ కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న జనం

మదనపల్లె: హంద్రీనీవా కాలువ కోసం తీసుకున్న భూములకు నష్ట పరిహారం కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నాం. పట్టించుకున్న నాథుడు లేడు. కనీసం మీరైనా పరిహారం ఇప్పించండి సబ్ కలెక్టర్ సార్.. అంటూ పీటీఎం మండలం కందుకూరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో రైతులతోపాటు, పలువురు తమ సమస్యలను సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు విన్నవించారు. • తమ గ్రామాలకు రహదారి సక్రమంగా లేక ఇబ్బంది పడుతున్నామని, అత్యవసర పరిస్థితుల్లో 108 వాహనం రావడం లేదని కోటవారిపల్లె తండా, ఉడుమువారిపల్లె తండావాసులు విన్నవించారు. • దేవళంవీధిలో తమ ఇంటి పక్కన ఖాళీ స్థలంలో చెత్తను పడేస్తున్నారని, చివరకు మున్సిపల్ శానిటరీ కార్మికులు అక్కడే చెత్త వేస్తున్నారని కాలనీ వాసి రహంతుల్లా ఫిర్యాదుచేశారు. • చిన్న తిప్పసముద్రం రెవెన్యూ సర్వే నెంబర్.997/41లోని తమ భూమిని రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం తీసుకుంటూ అధికారులు నోటీసులు మంజూరుచేశారని, వీఆర్వో రిపోర్ట్ పంపకపోవడంతో పరిహారం ఆలస్యమవుతోందని, నష్టపరిహారం మంజూరు చేయించాలని పి.ఆదినారాయణ విన్నవించారు. • మదనపల్లె మండలం బసినికొండ రెవెన్యూ సర్వేనెంబర్.451లోని స్వామి చెరువు, సప్లయిఛానల్ పూడ్చి దురాక్రమణకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని మనోహర్‌నాయుడు ఫిర్యాదుచేశారు. • బండమీదకమ్మపల్లె ఇందిరమ్మకాలనీ సమీపంలోని సర్వేనెం.440/బిలో దోబీఘాట్‌కు స్థలం మంజూరు చేయాలని రెడ్డెప్ప విన్నవించారు. • ప్రభుత్వ వైద్య కళాశాలలో 2024 మార్చి నుంచి కాంట్రాక్ట్ పద్ధతి కింద ఎంపికైన వారికి రెగ్యులర్‌గా వేతనాలిస్తున్నారని, ఔట్ సోర్సింగ్ స్టాఫ్‌కు వేతనాలివ్వలేదని ఆప్కాస్ ఎంప్లాయిస్ విన్నవించారు.

మోగిన మదనపల్లి టౌన్ బ్యాంకు ఎన్నికల నగారా

- 52 నెలల తర్వాత పాలకవర్గం ఎన్నికకు ముహూర్తం ఖరారు
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ దుర్గమ్మ



ది మదనపల్లె కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు

బ్యాంకు: కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకు
ఓటర్లు: 3401 మంది(ఇప్పటి వరకు)
18న ఎన్నికల నోటిఫికేషన్
22న నామినేషన్ల స్వీకరణ
23న పరిశీలన 24న ఉపసంహరణ 29న పోలింగ్, ఓట్ల లెక్కింపు

మదనపల్లె: వందేళ్ల ఘన చరిత్ర కలిగిన ది మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకుకు ఎన్నికల నగారా మోగింది. 2020 జూన్, 19న టౌన్ బ్యాంక్ పాలకవర్గం పదవీకాలం ముగిసింది. ఇప్పటివరకు ఎన్నికలు జరగకపోవడంతో సహకార శాఖకు చెందిన ప్రత్యేక అధికారి కార్యకలాపాలు కొనసాగించారు. 52 నెలల తర్వాత పాలకవర్గం ఎన్నికకు ముహూర్తం ఖరారు చేస్తూ మదనపల్లె డివిజన్ కో–ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.దుర్గమ్మ సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ ది మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ పరిధిలో మెయిన్‌బ్రాంచ్, ఎన్‌టీఆర్ సర్కిల్, పుంగనూరులో మొత్తం మూడు బ్రాంచీలు ఉన్నాయని తెలిపారు. 3,401 మంది ఓటర్లు ఉన్నారని, నవంబర్ 2వ తేదీ అర్హులైన ఓటరు జాబితా రూపొందించి, 3న నోటీసు బోర్డులో ప్రచురిస్తారన్నారు. ఓటరు జాబితాపై సభ్యుల అభ్యంతరాలకు వారం రోజుల గడువు ఉంటుందన్నారు. 11న తుది జాబితాను బ్యాంకు సీఈఓ ఎన్నికల అధికారికి అందజేస్తారని, జరుగుతుందన్నారు. మరుసటిరోజు కార్యనిర్వాహక సభ్యుల ఎన్నిక ఉంటుందన్నారు. 29న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్, 3 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ఉంటుందని, ఎన్నికలు ఎక్కడ జరపాలో కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రకటిస్తారన్నారు. సీఈఓ పెరవలి ప్రసాద్ మాట్లాడుతూ...టౌన్ బ్యాంకుకు పాలకవర్గం లేకపోవడంతో రిజర్వ్ బ్యాంకు నుంచి ఖాతాదారులకు అందించేందుకు మొబైల్ బ్యాంకింగ్ వ్యవస్థ, ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం తదితర యూపీఐ చెల్లింపులు వీలు కాలేదన్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.దుర్గమ్మ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో శ్యాంసుందర్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.